సాక్షి
ప్రకాశం



కథలు చెప్పడానికి వస్తారా..

సమీక్షలకు కథలు చెప్పడానికి వస్తారా అని పంచాయతీరాజ్ అధికారులపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆగ్రహం వ్యక్తం చేశారు.

- 10లో..

రహదారులు రక్తసిక్తం

జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా ఏడుగురికి గాయాలయ్యాయి.



- 10లో..

గరిష్ఠం/కనిష్ఠం
40 /26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోత అధికం.

శనివారం। 26। ఏప్రిల్। 2025

న్యూస్‌రీల్

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ డిమాండ్

ఒంగోలు సిటీ: మూతపడిన ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు, సీహెచ్ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యర్రగొండపాలెం డీఎంబీసీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలోని 8 మంది, కొమరోలు నల్లగుంట ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఒకరు, నల్లగుంట ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు, గిద్దలూరు వివేకానంద ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు, గిద్దలూరు ఎస్‌వీజీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఒకరు, కంభం శ్రీనివాస ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఆరుగురు, దొనకొండ ఇందిరా గాంధీ ఓరియంటల్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు, ఒంగోలు సమావేశం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఒకరు, ఒంగోలు హిందూ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఒకరు, మార్కాపురం శారద ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు, మార్కాపురం ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు, ఒంగోలు జీ వీఎస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 8 మంది, అర్ధవీడు ఎస్ఏస్ఆర్ఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు, అద్దంకి వేలమూరు ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఒకరు, పమిడిపాడు ఆది ఆంధ్ర ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఒకరు చొప్పున మొత్తం 49 మంది ఉపాధ్యాయులు మూతపడిన ఎయిడెడ్ పాఠశాలల్లో పని చేస్తున్నారని వారికి వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. వీటితో పాటు అదనంగా ఇతర పాఠశాలల్లో పనిచేస్తున్న ఎయిడెడ్ పాఠశాలల్లోని మిగులు ఉపాధ్యాయులు 205 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలోకి సర్దుబాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినారు

జూన్‌లో సామూహిక గృహ ప్రవేశాలు

- జిల్లాలో 8,839 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి
- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



గృహ నిర్మాణ ప్రగతిపై సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా జూన్‌లో 3 లక్షల గృహాలకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్ మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు నిర్దేశించిన 8,839 ఇళ్ల నిర్మాణాలు మే 31 వ తేదీ నాటికి పూర్తి చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని మునిసిపల్ కమిషనర్లను, ఎంపీడీఓలను, గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఇప్పటి వరకు కేవలం 2,824 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తి చేసి 32 శాతం మేర లక్ష్యాన్ని సాధించారన్నారు. ఇంకా 6,015 ఇళ్లు నిర్మించాల్సి ఉందని చెప్పారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు అందిస్తున్న 90 రోజుల పని దినాలు ప్రతి లబ్ధిదారునికి అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శ్రీనివాస ప్రసాద్, మెప్మా పీడీ శ్రీహరి, ఒంగోలు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు

ఒంగోలు సిటీ: మే నెలలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వినియోగించుకోవాలనుకునే ఉపాధ్యాయులకు ఒంగోలు జీజీహెచ్‌లో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు 230 మంది ఉపాధ్యాయులు, రెండోరోజు 116 మంది ఉపాధ్యాయులు హాజరైనట్లు తెలిపారు. 26వ తేదీ చివరి రోజున మిగిలిపోయిన ఉపాధ్యాయులందరూ తప్పక హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిందిగా కోరారు. వైద్య పరీక్షలు పూర్తయిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ఈ నెల 29 వ తేదీ నుంచి ఒంగోలు రిమ్స్‌లో వ్యక్తిగతంగా వచ్చి పొందాల్సిందిగా తెలిపారు. ఈ వైద్య పరీక్షలను ఒంగోలు డిప్యూటీ డీఈఓ చంద్రమౌళీశ్వరరావు, ఎంఈఓ కిషోర్‌బాబు పర్యవేక్షించినట్లు చెప్పారు.

ఆక్వా రైతు కష్టాల్లో మునిగిపోయాడు. వ్యాపారుల సిండికేట్‌తో రోజు రోజుకూ పతనమవుతున్న రొయ్యల ధరలు.. పెరుగుతున్న ఖర్చుల భారం.. కరెంటు చార్జీల కష్టాలతో సాగుదారుడు రోడ్డున పడుతున్నాడు. అండగా నిలవాల్సిన ప్రభుత్వం సిండికేట్లకు వత్తాసు పలుకుతోంది. మార్కెట్ మాయాజాలంతో రొయ్య రైతుల జీవితాలు 10 నెలల్లో తలకిందులయ్యాయి.



“ ప్రభుత్వం దృష్టి సారించాలి..



ఇప్పుడు ఆక్వా రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. రొయ్యల ధరలు ఇష్టమొచ్చినట్లుగా తగ్గించేస్తున్నారు. ఇంపోర్టెడ్ మినరల్స్ ధరలు తగ్గాయి. దానికి తోడు సోయా ధరలు కూడా తగ్గాయి. అందుకు అనుగుణంగా రొయ్యల ధరలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యూనిట్ రూ.1.50కే విద్యుత్ ఇస్తామన్న హామీని టీడీపీ కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. అంతేకాదు మేతలో కలిపే కాంపోజిషన్, ప్రీమిక్స్ ఇతర ముడిసరుకులపై కూడా దిగుమతి సుంకం పూర్తిగా తగ్గిన నేపథ్యంలో మేత ధర కిలోకి రూ.25–రూ.30 తగ్గించాలి.

– దుగ్గినేని గోపీనాథ్, ప్రకాశం జిల్లా రొయ్య రైతుల సంఘం అధ్యక్షుడు

సిండికేట్ల రొయ్యో్య్యో!

- ధరలు తగ్గించేస్తూ ఆక్వా రైతులను ముంచేస్తున్న సిండికేట్లు
- 20 రోజుల్లో భారీగా పడిపోయిన ధరలు
- సాగుకు ముందు 20 కౌంట్ టైగర్ రొయ్య ధర రూ.680 నేడు రూ.580కి పతనం
- గుదిబండగా మారుతున్న కరెంటు చార్జీలు
- అందుబాటులోకి రాని ఫీడు, మినరల్ ధరలు
- ఆక్వా రైతును గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- జిల్లాలో 12 వేల ఎకరాల్లో టైగర్ రొయ్యల సాగు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఏళ్లుగా ఆక్వా సాగు చేస్తున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. మార్కెట్‌ను ఎక్స్‌పోర్టు చేస్తున్న ప్రాసెసింగ్ కంపెనీలు శాసిస్తున్నాయి. రొయ్యల ధరలు ఇష్టమొచ్చినట్లుగా తగ్గించేస్తున్నారు. ఫీడు ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. ఆక్వా సాగు చేస్తున్న రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ ఇస్తామన్న హామీని టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే ఎగ్గొట్టింది. అన్నీ తలచుకొని ఆక్వా రైతులు విలవిల్లాడుతున్నారు. గిట్టుబాటు ధర రాక సతమతమవుతున్నారు. ట్రంప్ సుంకాల పేరు చెప్పి ఎగుమతిదారులు అడ్డగోలుగా ధరలు తగ్గించేయడంతో పరిస్థితి మరింతగా దిగజారుతోంది. కంపెనీలు చెల్లిస్తున్న ధరలు తమకు ఏమాత్రం గిట్టుబాటు కావని ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 14 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. అందులో 12 వేల ఎకరాల్లో టైగర్ రొయ్య, రెండు వేల ఎకరాల్లో వనామీ రకాన్ని సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి సాగు చేపట్టారు. నెల రోజుల నుంచి సాగుతో ఆక్వా రైతులు ముమ్మరంగా ఉన్నారు. మంచి ధరలు ఉండడంతో దాదాపు 30 టన్నుల సీడును తీసుకొచ్చి సాగు ప్రారంభించారు. ప్రారంభంలో మంచి ధరలు ఉన్నా సాగు ప్రారంభమయ్యాక రేట్లు పతనమయ్యాయి. ఇక మార్కెట్లో ఫీడు ధరలు తగ్గినా కంపెనీలు మాత్రం తగ్గించకపోవడం, సోయా ధరలు భారీగా తగ్గినా కేవలం రూ.3 లు తగ్గించడంతో రైతుకు ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు.



రొయ్యల చెరువు

20 రోజుల్లో భారీగా పడిపోయిన ధరలు:

టైగర్ రొయ్యల ధరలు 20 రోజుల్లో భారీగా పడిపోయాయి. సాగు ప్రారంభానికి ముందు వరకు 20 కౌంట్ టైగర్ రొయ్యలు కిలో రూ.680 వరకు ధర పలికింది. ట్రంప్ టారిఫ్, వ్యాపారులు సిండికేట్ కావడంతో ఒక్క సారిగా కిలోకు రూ.100 తగ్గిపోయింది. ప్రస్తుతానికి ట్రంప్ టారిఫ్ సుంకం లేకపోయినా సిండికేట్ వ్యాపారులు ఏమాత్రం పెంచటం లేదు. దాంతో ఒక్కో రైతు లక్షల్లో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పెరిగిన లీజు, ఫీడ్, విద్యుత్ చార్జీలతో 100 కౌంట్‌కు రావాలంటే కిలోకు రూ.220– రూ.250 వరకు ఖర్చవుతుంది. అదే 50 కౌంట్ కు చేరాలంటే కిలోకు రూ.330– రూ.350 వరకు, గరిష్ఠంగా 30 కౌంట్‌కు రావాలంటే కిలోకు రూ.450– రూ.490 ఖర్చు అవుతోంది. మరి 20 కౌంటుకు రావాలంటే కిలోకు రూ.500లకు పైనే వ్యయం అవుతుంది. ఎకరా సాగుకు సీడ్, సాగుకు అవసరమైన హెల్త్‌కేర్ మినరల్స్, కరెంటు చార్జీలు, కూలీ ఖర్చులు అన్నీ కలుపుకుని సుమారు రూ.7 లక్షల వరకూ ఖర్చవుతుంది. ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధరల ప్రకారం రైతుకు కష్టకాలమనే చెప్పాలి. రానున్న రోజుల్లో ధరలు మరింత పతనం అయ్యే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్న నేపథ్యంలో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలుస్తోంది.

యూనిట్ విద్యుత్ రూ.1.50కే హామీ గాలికి..

ఆక్వాజోన్, నాన్ ఆక్వా జోన్ విస్తీర్ణంతో సంబంధం లేకుండా ఆక్వా సాగు చేసే ప్రతి రైతుకు యూనిట్ విద్యుత్ రూ.1.50 కే సరఫరా చేస్తామని ఎన్నికల్లో కూటమి పార్టీల నేతలు హామీ ఇచ్చారు. సబ్సిడీపై ఏరియేటర్లు, ట్రాన్స్ ఫార్మర్లు, ఇతర ఆక్వాకు సంబంధించిన పరికరాలపై అందిస్తామని కూడా నమ్మబలికారు. ఆ హామీని గాలికి వదిలేయటంతో రైతులు లక్షలాది రూపాయలు కరెంటు బిల్లుల రూపంలో చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో ఆక్వా రైతుపై భారం మోయలేనంతగా పడుతోంది.

ఆక్వాకు అండగా వైఎస్ జగన్...

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం గత ఐదేళ్లూ ఆక్వా రైతులకు అండగా నిలిచింది. ఆక్వా కార్యకలాపాలన్నీ ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు అప్సడా చట్టంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంది. కరోనా సమయంలో ధరలేక 100 కౌంట్ రూ.150 – రూ.180 మధ్య కంపెనీలు కొనుగోలు చేస్తున్న సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.210గా నిర్ణయించి అంతకంటే తక్కువకు కొనుగోలు చేయకుండా కట్టడి చేసింది. సంక్షోభ సమయంలో సీనియర్ మంత్రులతో ఆక్వా రైతు సాధికార కమిటీని నియమించి ప్రతి 15 రోజులకోసారి అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా సమీక్షించి తగ్గకుండా చర్యలు తీసుకుంది. అంతేకాకుండా పెంచిన ఫీడ్ ధరలను మూడుసార్లు వెనక్కి తీసుకునేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఫలితంగా మేత ఖర్చులు భారం రైతులపై పడకుండా అడ్డుకుందని ఆక్వా రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వంలో విధ్వంసక పాలన

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్



సుంకిరెడ్డిపాలెంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆదిమూలపు సురేష్

పొన్నలూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో దాడులు, కేసులతో విధ్వంసక పాలన నడుస్తోందని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని సుంకిరెడ్డిపాలెంలో లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఉత్సావాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో అబద్ధపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజల ఓట్లతో గెలిచిన తరువాత చెప్పిన వాగ్దానాలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువునా ముంచాడని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ నేతలపై, సామాన్య ప్రజలపై దాడులు, కేసులు తప్పా అభివృద్ధి, సంక్షేమం శూన్యమన్నారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, కూటమి పార్టీ నేతలకే రాష్ట్రంలో రక్షణ కరువైందన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో దాడులు, కేసులు, అరాచకాలు, అవినీతి, ఊరూరా బెల్ట్ షాపుల తప్పా అన్ని వర్గాల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. చంద్రబాబు చేస్తున్న అరాచక పాలనను ప్రజలు, ఉద్యోగులు, రైతులు, నిరుద్యోగులు, మేధావులు గమనిస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో తప్పక బుద్ధి చెబుతారన్నారు. మళ్లీ రాష్ట్రంలో రాజన్న రాజ్యం రావాలంటే జగన్‌ని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, సర్పంచ్ లెక్కల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యావరణ కార్యదర్శి కాటా మాధవరావు, కొండపి నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షులు పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచులు వరికూటి రామిరెడ్డి, వరికూటి బ్రహ్మారెడ్డి, లెక్కల వెంకటరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వరికూట నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఎనిమిరెడ్డి తిరుపాల్‌రెడ్డి, సర్పంచ్ మార్తాల వెంకటేశ్వరరెడ్డి, కాటా మల్లికార్జునరావు, దగ్గుమాటి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రత్యేకంగా యువ ప్రకాశం

- వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఇంటర్న్ షిప్ సౌకర్యం
- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా



'యువ ప్రకాశం' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఇంటర్న్ షిప్ కోసం జిల్లాలో ప్రత్యేకంగా యువ ప్రకాశం కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం యువ ప్రకాశం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పోస్ట్ గ్రాడ్యుయేట్, డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇతర పథకాల గురించి అవగాహన కల్పించేందుకు జిల్లాలో ప్రత్యేకంగా "యువ ప్రకాశం" అనే కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసేందుకు వివిధ అంశాల్లో 30 రోజుల ఇంటర్న్ షిప్‌ను చేసేందుకు అవకాశం కల్పించించామని చెప్పారు. వాటర్ మేనేజ్మెంట్, హెల్త్, పంచాయతీ రాజ్, ఉపాధి కల్పనా అవకాశాలు, మహిళా, శిశు ఆరోగ్య కార్యక్రమాలు, రోడ్లు అండ్ భవనాల నిర్మాణ రీతులు, నగర అభివృద్ధి కార్యక్రమాలలో శిక్షణ ఇస్తారని చెప్పారు. ఈ ఇంటర్న్ షిప్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మే 14 నుంచి జూన్ 13 వరకు 30 రోజుల పాటు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను మే 8 వ తేదీలోగా ఈ లింక్ ద్వారా హెచ్‌టీటీపీ//టీఎస్‌వై.సీసీ/జీఎస్ఐపీ కింద తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఈ ఇంటర్న్ షిప్ నోడల్ అధికారి, ఒంగోలు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.శ్రీమన్నారాయణ తెలిపారు. ఇతర వివరాల కోసం కార్యాలయపు పని వేళల్లో స్వయంగా కానీ, ఫోన్ ద్వారా గానీ 9182891095, 9885544154 సంప్రదించవచ్చన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు



సమీక్షిస్తున్న కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, పక్కన డ్వామా పీడీ జోసెఫ్ కుమార్

ఒంగోలు సబర్బన్: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతిపై అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం డ్వామా అధికారులు, ఎంపీడీవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేపట్టడానికి వేసవి అనుకూలం అయినందున పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించేలా క్షేత్ర స్థాయిలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్దేశించిన లక్ష్యాలు పూర్తిచేయాలన్నారు. పనుల పురోగతిపై అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. లేబర్ మొబిలైజేషన్‌లో త్రిపురాంతకం, ముండ్లమూరు, తాళ్లూరు, హెచ్‌ఎంపాడు, గిద్దలూరు మండలాలు లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయన్నారు. కూలీలకు రోజువారి సగటు వేతనం రూ.307 తగ్గకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పుల్లలచెరువు, పెద్దారవీడు, దోర్నాల, దొనకొండ, పామూరు, జరుగుమల్లి, పీసీపల్లి, తాళ్లూరు, వై పాలెం, అర్ధవీడు మండలాల్లో గత వారం కంటే ఈ వారం కూలీలకు రోజువారి సగటు వేతనం తగ్గిందని, ఈ మండలాల్లో సగటు వేతనం తగ్గడానికి కారణాలను కలెక్టర్ సంబంధిత ఎంపీడీఓలను, ఏపీఓలను అడిగి తెలుసుకున్నారు. వారు చెప్పిన కారణాలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనుల విధులపై కనీసం అవగాహన లేకుండా ఎలా పని చేస్తున్నారని నిలదీశారు. లక్ష్యం మేరకు పశువుల నీటి తొట్టెలు, ఫారం పాండ్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణాలపై అవసరమైన మేరకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), జీవన జ్యోతి యోజన పథకాలను ఉపాధి హామీ కూలీలకు వర్తించేలా క్షేత్ర స్థాయిలో ఎంపీడీఓలు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ జోసెఫ్ కుమార్, ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపీఓలు పాల్గొన్నారు.

ఆధిపత్యమా..ఆర్థిక లావాదేవీలా..?

- వీరయ్య చౌదరి హత్య కేసును మలుపు తిప్పిన స్కూటీ
- అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ యువ నేతే సూత్రధారిగా భావిస్తున్న పోలీసులు
- పోలీసుల అదుపులో కీలక నిందితుడు
- అమ్మనబ్రోలులో హై అలర్ట్
- ఈ హత్యలో టీడీపీ నేతల ప్రమేయం వెలుగు చూస్తుండడంతో ఆందోళనలో అధికార పార్టీ ముఖ్యనేతలు
- 60 శాతం సీసీ కెమెరాలు పట్టిస్తే.. మిగతా కేసును కొలిక్కి తెచ్చిన స్కూటీ
- కీలక ఆధారాలు లభ్యమవడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి హత్య కేసు కీలక పురోగతి సాధించింది. దారుణ హత్య జరిగిన నాటి నుంచి వివిధ రకాల కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. ప్రధానంగా లిక్కర్, భూ, ఆర్థిక, రైస్ మాఫియా వివాదాలే కారణమని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. పోలీసులు ఆ దిశగా ముమ్మర దర్యాప్తు చేశారు. అయితే శుక్రవారం చీమకుర్తి వద్ద హత్యకు వినియోగించిన స్కూటీ లభ్యం కావడంతో కేసు పురోగతి సాధించింది. దాదాపు కేసులో కీలక ఆధారాలు సేకరించినట్లుగా తెలుస్తోంది. హత్యకు సంబంధించి అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ యువనేత ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్నారు. ఆధిపత్య పోరు నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్టుగా విశ్వసనీయ సమాచారం. ఆ దిశగా వివరాలను సైతం రాబట్టినట్టు తెలుస్తోంది. ఈ హత్యకు సంబంధించి టీడీపీ నేతల ప్రమేయం ఉందని తేలడంతో ఈ కేసు ఎటు దారి తీస్తుందోనని ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజులుగా ఎలాంటి క్లూ లభించని పోలీసులు ప్రస్తుతం ఊపిరి పీల్చుకుంటున్నారు. టీడీపీ నాయకుని హత్య జరిగిన సమాచారం తెలిసిన వెంటనే రాష్ట్ర హోం మంత్రి అనిత రాత్రికి రాత్రే ఒంగోలు వచ్చారు. అంత్యక్రియలు పూర్తయ్యేంత వరకు ఇక్కడే గడిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం అమ్మనబ్రోలు వచ్చి వీరయ్యకు నివాళులర్పించారు. ఈ నేపథ్యంలో వీరయ్య హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. 12కు పైగా బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎంత మంది అనుమానితులను విచారించినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. విశాఖ, రామాయపట్నం, కావలి, బెంగళూరు, హైదరాబాద్ అంటూ అనేక ప్రాంతాల పేర్లు కూడా ప్రచారం జరిగింది. రకరకాల కథనాలు వచ్చాయి. ఈ కోణంలో జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా సుమారు 40 మంది వరకు అనుమానితులను తీసుకొచ్చి విచారణ చేశారు. అయినా పోలీసులకు ఎలాంటి క్లూ లభించలేదు. చివరికి ఘటనా స్థలాన్ని రెండోసారి కూడా ఎస్పీ ఏఆర్ దామోదర్ సందర్శించి మరోసారి ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది.



వీరయ్య చౌదరి (ఫైల్)

60 శాతం సీసీ కెమెరాలు.. మలుపు తిప్పిన స్కూటీ..

ఈ హత్య కేసు పురోగతికి సంబంధించి 60 శాతం సీసీ కెమెరాలు ఉపయోగపడ్డాయని తెలుస్తోంది. మిగతా 40 శాతం చీమకుర్తి జాతీయ రహదారి పక్కన ఒక్క దాబా వద్ద హంతకులు వినియోగించినట్లు చెబుతున్న స్కూటీ దొరకడంతో కేసు కీలక మలుపు తిరిగింది. పోలీసులకు కీలక ఆధారాలు లభ్యమైనట్టయింది. ముందుగా స్కూటీని పెట్రోలింగ్ పోలీసులు గమనించారు. దాని మీద రక్తపు మరకలు ఉండటంతో పక్కనే ఉన్న వారిని విచారించారు. మూడు రోజులుగా ఆ స్కూటీ ఇక్కడ ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు చీమకుర్తి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే రంగంలోకి దిగిన చీమకుర్తి పోలీసులు స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. స్కూటీ మీద ఉన్న రక్తపు మరకలను వైద్య పరీక్షలు చేయించగా వీరయ్య చౌదరి రక్తంతో సరిపోయినట్లు తెలిసింది. దాంతో వెంటనే వాహన యజమాని కోసం ఆరా తీశారు. ఒంగోలు ఇస్లాంపేటలోని ఒక వ్యక్తి పేరు మీద వాహనం ఉన్నట్లు తెలుసుకొని అతడిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలుస్తోంది. ఆ స్కూటీని అమ్మనబ్రోలుకు చెందిన వారికి విక్రయించానని చెప్పడంతో కేసు కీలక మలుపు తిరిగింది. అయితే బండిని తన పేరు మీదే ఉందని చెప్పినట్లు తెలిసింది. దీంతో కథ వీరయ్య చౌదరి స్వగ్రామం అమ్మనబ్రోలుకు చేరింది. ఆ గ్రామంలోనే టీడీపీ యువనేత ఈ హత్యకేసులో కీలకంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అతనిని పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. ఆధిపత్య కారణాలతోనే ఈ హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. మొత్తం మీద వీరయ్య చౌదరి హత్య కేసు ఒక కొలిక్కి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకుంటున్నారు.



అమ్మనబ్రోలు లో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

హత్య జరిగిన రోజు నుంచే....

నిజానికి వీరయ్య చౌదరి హత్య జరిగిన రోజు రాత్రే అమ్మనబ్రోలుకు చెందిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రెండు రోజుల పాటు విచారించినప్పటికీ ఆయన నుంచి ఎలాంటి సమాచారం లభించకపోవడంతో వదిలిపెట్టినట్లు తెలిసింది. అయితే పోలీసుల విచారణకు సహకరించాలని, ఎప్పుడు పిలిచినా పోలీసు స్టేషన్‌కు రావాల్సి ఉంటుందని చెప్పి పంపించినట్లు సమాచారం. ఇప్పుడు అతడే ప్రధాన నిందితుడని తెలిసి పోలీసులు విస్మయానికి గురయ్యారు. నిందితుడి స్వగ్రామం అమ్మనబ్రోలు అయినా ఒంగోలు నగరంలోని కమ్మపాలెంలో నివాసం ఉంటాడని ప్రచారం జరుగుతోంది. అంజయ్య రోడ్డులో కార్యాలయం కూడా ఉన్నట్లు చెబుతున్నారు.

హత్యలో పాల్గొంది ఎక్కడి వారు..

వీరయ్య చౌదరి కేసులో మొత్తం నలుగురు నిందితులు హత్యకు పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నారు. అమ్మనబ్రోలుకు చెందిన ప్రధాన నిందితుడితో పాటుగా ఒంగోలుకు చెందిన మరొక వ్యక్తి కూడా కీలక పాత్ర పోషించినట్లు ప్రచారం జరుగుతోంది. హత్యలో అతడు స్వయంగా పాల్గొన్నట్లు సమాచారం. అదేరోజు అతడు వైజాగ్ వెళ్లినట్లు తెలుస్తోంది. వైజాగ్‌లో అతడిని పట్టుకున్న పోలీసులు విమాన మార్గంలో విజయవాడకు తరలించి, అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఒంగోలుకు తరలిస్తున్నట్లు సమాచారం. అలాగే కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి కూడా మరొక నిందితుడిని పోలీసులు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. మరో ఇద్దరి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది.

తెరపైకి కొత్త పేర్లు

వీరయ్య చౌదరి హత్య కేసులో కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. అమ్మనబ్రోలుకే చెందిన మరో వ్యక్తి సైతం ఈ హత్యలో ప్రమేయం ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. కొంత కాలంగా ఆయనకు, వీరయ్య చౌదరికి మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నట్లు చెప్పుకుంటున్నారు. ఆయన ఆర్థిక మూలలను దెబ్బ తీసేందుకు వీరయ్య చౌదరి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. దాంతో ప్రధాన నిందితుడితో కలిసి ఈ హత్యకు ప్లాన్ చేసినట్లు కథనాలు వినిపిస్తున్నాయి. హత్య కేసులో పురోగతి కనిపించడంతో ఆ వివరాలను జిల్లా అధికారులు రాష్ట్ర హోం శాఖ మంత్రికి, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా రెండు రోజుల్లో రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అమ్మనబ్రోలుకు వస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.


అమ్మనబ్రోలులో హై అలర్ట్

నాగులుప్పలపాడు: మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్య నేపథ్యంలో గ్రామంలో హైఅలర్ట్ నెలకొంది. గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుని పేరు ఈ హత్య కేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన పోలీసులు కస్టడీలోనే ఉన్నట్లు తెలిసింది. వీరిరువురికి గ్రామంలో గతంలో వర్గపోరు ఉంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవి ముదిరిపాకాన పడ్డాయన్న ప్రచారం జరుగుతోంది. ఇరువర్గాల మధ్య ఆధిపత్య పోరే ఈ హత్యకు దారితీశాయా..? అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఇక గ్రామంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందుగానే పోలీసులు గ్రామంపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఇప్పటికే ప్రత్యేక బలగాలు గ్రామంలో మోహరించాయి. ఎస్పీ ఏఆర్ దామోదర్ శుక్రవారం సాయంత్రం 6.40 ప్రాంతంలో గ్రామానికి వచ్చారు. టీడీపీ నేత కుటుంబ సభ్యులను విచారించారు. దాదాపు మూడు గంటల పాటు ఆయన గ్రామంలోనే ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోనే ప్రతి ఒక్కరూ సహనంతో వ్యవహరించాలన్నారు. ఎలాంటి ఊహాగానాలను నమ్మవద్దన్నారు. చట్టప్రకారం నిందితులను పట్టుకుంటామన్నారు. ఎవరైనా క్షణికావేశంతో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

క్లుప్తంగా

సీఎం చంద్రబాబే న్యాయం చేయాలి

- టీడీపీ నేత భూకబ్జాపై బాధితుడి మొర
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



ఆస్తి డాక్యుమెంట్లు చూపుతున్న నారాయణరెడ్డి

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివార్లలో ఉన్న తన భూమిని టీడీపీ నాయకుడు, మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి కబ్జా చేశాడని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని పట్టణంలోని తూర్పువీధికి చెందిన గొలమారి నారాయణరెడ్డి సోషల్‌మీడియా వేదికగా విడుదల చేసిన వీడియోలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశాడు. సర్వే నంబరు 1132/3 లో ఉన్న తన ఆస్తిని జీవీ సాయికుమార్‌రెడ్డి దగ్గర కొనుగోలుచేసి అనీల్‌కుమార్‌రెడ్డికి అమ్మాడన్నారు. అయితే ఈ ఆస్తి తన పేరుపై ఉందని, డాక్యుమెంట్లు ఉన్నాయని చెప్పినా వినకుండా తాము అధికారంలో ఉన్నామని చెబుతూ తమను బెదిరించారని ఆందోళన వ్యక్తం చేశారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ఏదైనా ప్రాణహాని జరిగితే వారే బాధ్యులని, మిగిలిన ఆస్తిని కూడా కబ్జా చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. తనకు న్యాయం చేయాలని కలెక్టర్, సబ్‌కలెక్టర్, తహశీల్దార్‌ను కోరుతున్నట్టు తెలిపారు. ఈ విషయమై పట్టణపోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు నారాయణరెడ్డి కుమారుడు శివారెడ్డి తెలిపారు. తమ ఆస్తిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడంతోపాటు బెదిరింపులకు పాల్పడుతున్నారని, తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. టీడీపీ నేతల భూకబ్జాలపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమవుతోంది.

వృద్ధురాలి పర్సు చోరీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అన్నా క్యాంటీన్ వద్ద ఓ వృద్ధురాలి నుంచి రూ.39 వేలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ మేరకు బాధితురాలు శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. పట్టణంలోని సీతారాములవారి ఆలయం వీధిలో నివాసం ఉంటున్న బత్తుల రంగలక్ష్మమ్మ అన్నా క్యాంటీన్ వద్ద భోజనం చేసేందుకు వెళ్లింది. భోజనం అనంతరం చేతిని శుభ్రం చేసుకునే క్రమంలో ఆమె వద్ద ఉన్న నగదుతో కూడిన పర్సును పక్కన పెట్టింది. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పర్సును అపహరించారు.



ఒంగోలు వేలం కేంద్రంలో పొగాకు బేళ్ల వద్ద అయోమయంలో రైతులు



బయ్యర్లపై రైతుల ఆగ్రహం

ధర్మాగ్రహం

- పొగాకు రైతుకు దక్కని కనీస గిట్టుబాటు ధర
- బోర్డు అధికారులు, బయ్యర్ల తీరుపై నిప్పులు
- మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలని డిమాండ్



దిక్కుతోచని స్థితిలో పొగాకు రైతు

పొగాకు రైతులతో వ్యాపారులు చెలగాటం ఆడుతుండగా టుబాకో బోర్డు అధికారులు చోద్యం చూస్తున్నారు. బోర్డు అధికారుల మాటలు నమ్మి పొగాకు పండించిన రైతులు గిట్టుబాటు ధర దక్కక లబోదిబోమంటున్నారు. నాణ్యమైన పొగాకును సైతం తక్కువ ధరకు అడుగుతుండటంతో ఏమి చేయాలో దిక్కుతోచక బిక్కమొహం వేస్తున్నారు. ఈ ఏడాది 20 శాతం పంటను అధికంగా పండించుకోండని ఉచిత సలహాలిచ్చిన బోర్డు అధికారులు.. గిట్టుబాటు ధర కల్పించే విషయంలో ప్రభుత్వ సహకారం లేక చేతులెత్తేశారు. గత ప్రభుత్వ హయాంలో కేజీ పొగాకు ధర గరిష్ఠంగా కేజీ రూ.360, కనిష్ఠంగా కేజీ రూ.230 పలకగా.. ప్రస్తుతం గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.220 మించడం లేదు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి వ్యయప్రయాసలకోర్చి పొగాకు పండిస్తే.. కనీసం పెట్టుబడి సొమ్ము కూడా చేతికొచ్చేలా లేదని వేలం కేంద్రాల వద్ద రైతులు గగ్గోలు పెడుతున్నారు. వేలానికి తెచ్చిన బేళ్లకు గిట్టుబాటు ధర ఇవ్వకపోతుండటంతో కొందరు ఇళ్లకు తరలిస్తుండగా, మరికొందరు కోల్డ్ స్టోరేజీల్లో భద్రపరుస్తున్నారు. బేళ్లను పదే పదే వేలానికి తీసుకురావడం ఇబ్బందిగా ఉంటోందని, మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు కొనుగోలు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తొలి ఏడాది మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పొగాకు కొనుగోలు చేయించి ఆదుకున్న విషయాన్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

– సాక్షి ఒంగోలు



గిట్టుబాటు కాలేదని పొగాకు బేళ్లను వెనక్కి తీసుకెళ్తున్న రైతు



సరైన ధర ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు



బేళ్లను ట్రాక్టర్‌కు ఎత్తుకుంటున్న రైతులు

సమీక్షకు కథలు చెప్పడానికి వస్తారా.?

- పారిశుధ్య సమస్యలపై ఎందుకు దృష్టి సారించడం లేదు
- పలువురు ఈఓలు, ఎంపీడీఓలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆగ్రహం
- షోకాజ్ నోటీసుల జారీకి ఆదేశం

ఒంగోలు సబర్బన్: మీరు చెప్పే కథలు వినడం కోసం ఇక్కడకు పిలిపించానా.. సమీక్షకు కథలు చెప్పడానికి వస్తారా.? అంటూ కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ విభాగాల అధికారులతో స్థానిక ప్రకాశం భవనంలో శుక్రవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పారిశుధ్య సమస్యల పరిష్కారంపై ఎందుకు దృష్టి సారించడంలేదని మండిపడ్డారు. పనిచేయడం కోసమే ప్రభుత్వం మీకు జీతాలిస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలంటూ మందలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు. చెత్త తరలించేందుకు రిక్షాలు, క్లాప్ మిత్రలు, తాగునీటి వాటర్ ట్యాంకులు శుభ్రం చేయడం, క్లోరినేషన్, రోడ్ల వెంట చెత్త కుప్పల తొలగింపు తదితర అంశాలపై నిర్వహించిన సమీక్షలో అధికారుల తీరుపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

పెద్దారవీడు పీఈఓ, వై.పాలెం ఎంపీడీఓకు షోకాజ్ నోటీసులు...

సమావేశానికి పెద్దారవీడు పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హాజరు కాకపోవడంపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు. తన అధ్యక్షతన సమావేశం ఉన్నప్పటికీ పెద్దారవీడు అధికారి ఎందుకు రాలేదని డీపీఓ జి.వెంకట నాయుడుని ప్రశ్నించారు. తనకు కూడా ఎలాంటి సమాచారం లేదని ఆయన సమాధానమిచ్చారు. దీంతో పెద్దారవీడు ఈఓకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యర్రగొండపాలెం ఈఓ కూడా రాకపోవడంపై కలెక్టర్ ప్రశ్నించారు. స్థానికంగా వేరే కార్యక్రమం ఉన్నందున తాను అనుమతిచ్చానని యర్రగొండపాలెం ఎంపీడీఓ చెప్పారు. దాంతో ఎంపీడీఓపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఓలు, ఎంపీడీఓలతో తాను సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తే.. కనీసం తన దృష్టికి తీసుకురాకుండా ఈఓ గైర్హాజరుకు ఎలా అనుమతిస్తారంటూ ఎంపీడీఓను నిలదీశారు. యర్రగొండపాలెం ఎంపీడీఓకు కూడా షోకాజ్ నోటీస్ జారీ చేయాలని జెడ్పీ సీఈఓను కలెక్టర్ ఆదేశించారు. చెత్త తరలించడానికి రిక్షాల సమస్య ఉందని, నెలకు రూ.6000 జీతానికి క్లాప్ మిత్రలు పనిచేయడం లేదని పలువురు ఈఓలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రిక్షాల సమస్య పరిష్కారానికి ఏమైనా చర్యలు తీసుకున్నారా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారా, ఉన్నతాధికారులకు తెలియజేశారా, అలాంటివేమైనా ఉంటే చెప్పండి, వాటి గురించి ఆలోచించకుండా ఇక్కడకు వచ్చి ఈ కథలు ఎందుకు చెబుతున్నారంటూ కలెక్టర్ మండిపడ్డారు. దీనికోసమా మిమ్మల్ని ఇక్కడకు పిలిపించింది, క్షేత్రస్థాయిలో మీరు ఉండి ఏం పనిచేస్తున్నారని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లాప్ మిత్రలకు ఇచ్చే వేతనాలను స్థానిక వనరుల నుంచే సమకూర్చుకోవడంపై దృష్టి సారించాలన్నారు. తమ పరిధిలోని సమస్యలపై ఎంపీడీఓలు, డీఎల్‌పీఓలు దృష్టి పెట్టాలని ఆమె ఆదేశించారు. సమీక్ష సమావేశం అజెండా ముందుగానే చెప్పినప్పటికీ సరిగ్గా సన్నద్ధం కాకుండా మొక్కుబడి సమాధానాలు చెప్పడానికి వచ్చారా అని కలెక్టర్ ప్రశ్నించారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఇండికేటర్స్‌లో జిల్లా స్థానం పేలవంగా ఉంటే బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. వచ్చే శుక్రవారం నాటికి ఆయా ఇండికేటర్స్‌లో గణనీయమైన పురోగతి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ బాలశంకరరావు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, పంచాయతీల ఈఓలు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ విభాగం అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

మలేరియా నియంత్రణ అందరి బాధ్యత

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ఒంగోలు సబర్బన్: మలేరియా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రకాశం భవన్ వద్ద అవగాహన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారితో మలేరియా నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టరేట్ నుంచి నెల్లూరు బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతపై అందరూ శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ సౌకర్యాలు, చికిత్సకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయని చెప్పారు. ర్యాలీలో డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మధుసూదన్‌రావు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమలను ప్రోత్సహించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల శాఖ అధికారులు, ఏపీఐఐసీ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన ద్వారా ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ సింగిల్ డెస్క్ పాలసీ–2015, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ), పీఎం విశ్వకర్మ యోజన, ఆంధ్రప్రదేశ్‌లో రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్‌ఎంఈ పనితీరు (ఆర్‌ఏఎంపీ) పథకం కింద ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్–కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఈఎస్‌డీపీలు), ఉద్యమ్ వర్క్‌షాప్, ఎంఎస్‌ఎంఈ సర్వే, ఇన్సెంటివ్ రిలీజ్, ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు స్థల సేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఉపాధి అవకాశాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నియోజకవర్గంలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్కుకు అవసరమైన స్థల సేకరణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమయం ఇచ్చి పనిచేయించుకోవాలి



తహశీల్దార్ల సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఒంగోలు సబర్బన్: రెవెన్యూ అధికారులకు సమయం ఇచ్చి పనిచేయించుకోవాలని, పారదర్శకంగా పనిచేయటానికి తహశీల్దార్లు సిద్ధంగా ఉన్నారని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఓ ప్రైవేటు హోటల్‌లో శుక్రవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా తహశీల్దార్లతో సమావేశంలో బొప్పరాజు ముఖ్య అతిథిగా మాట్లాడారు. తహశీల్దార్లు కష్టపడి పనిచేయటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల్లో సమావేశాలు నిర్వహిస్తూ తహశీల్దార్లతో మమేకం అవుతున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చిస్తున్నామని చెప్పారు. తహశీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలంటే కార్యాలయాలకు సరిపడా నిధులు కేటాయించాలన్నారు. అదేవిధంగా మౌలిక సదుపాయాలు కూడా కల్పించాలన్నారు. కొత్త కొత్త చట్టాలు చేస్తున్నారని, అందుకు అనుగుణంగా అధికారులకు, సిబ్బందికి శిక్షణ కూడా ఇవ్వాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు పిన్నిక మధుసూదనరావు, కార్యదర్శి వాసుదేవరావు, ఒంగోలు కార్యాలయ కార్యదర్శి ఊతకోలు శ్రీనివాస రావుతో పాటు రెవెన్యూ అసోసియేషన్ నాయకులు ఉన్నారు.

రహదారులు రక్తసిక్తం



వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఏడుగురికి గాయాలు

కారు అదుపుతప్పి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి



మృతిచెందిన రవీంద్రారెడ్డి

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతిచెందిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని పెంచికలపాడు సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేపై శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. అర్ధవీడు మండలం చర్లోదొనకొండకు చెందిన చందా వెంకట రవీంద్రారెడ్డి (39) చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తూ తిరుపతిలో స్థిరపడ్డాడు. భార్య లక్ష్మి, కుమార్తె అక్షరతో కలిసి కారులో తిరుపతి నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. పెంచికలపాడు వద్ద గేదెను తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి హైవే కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకట రవీంద్రారెడ్డి తీవ్రంగా గాయపడి స్టీరింగ్ వద్ద ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై రవీంద్రారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని కారులో నుంచి రవీంద్రారెడ్డిని బయటకు తీశారు. కారు నుజ్జునుజ్జు అయింది. క్షతగాత్రులను 108 వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ప్రమాదానికి గురై దెబ్బతిన్న కారు

లారీ ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి



మృతిచెందిన మహిళ

సింగరాయకొండ: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై మండలంలోని శానంపూడి జంక్షన్ వద్ద జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శానంపూడి జంక్షన్ వద్ద నలభై ఏళ్ల వయసున్న గుర్తుతెలియని మహిళ రోడ్డు దాటుతుండగా, కావలి నుంచి ఒంగోలువైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఆమె తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని 108 అంబులెన్స్‌లో కందుకూరు ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.



సంఘటన స్థలం

కారు ఢీకొని యువకుడు మృతి



మృతి చెందిన దిలీప్(ఫైల్)

యర్రగొండపాలెం: మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లి సమీపంలో గురువారం రాత్రి 12గంటల సమయంలో చోటుచేసుకుంది. యర్రగొండపాలేనికి చెందిన టి.దిలీప్(25) బైక్‌పై కుంట వద్దకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో బోయలపల్లి డంపింగ్ యార్డు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన దిలీప్‌కు స్థానిక ప్రైవేట్ వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

బైకులు ఢీకొని ఐదుగురికి గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

యర్రగొండపాలెం: ఎదురెదురుగా వస్తున్న మోటారుసైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం యర్రగొండపాలెం మండలంలోని మురారిపల్లె చెరువుకట్ట వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. పుల్లలచెరువు మండలంలోని పిడికిటివానిపల్లె గ్రామానికి చెందిన ఏడుకొండలు, చెన్నయ్య, వెంకటేశ్వర్లు వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై యర్రగొండపాలెం వస్తున్నారు. అదే మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన అంజయ్య, ఏడుకొండలు యర్రగొండపాలెంలో తమ పనులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. మురారిపల్లె చెరువుకట్ట వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఏడుకొండలు, చెన్నయ్యకు తీవ్రంగా, మిగిలిన ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి. క్షతగాత్రులు స్థానిక ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.